అగనంపూడి టోల్‌గేట్‌పై రగడ

- ముదురుతున్న వివాదం
- టోల్ బూత్‌లు ధ్వంసం
- పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసిన నేషనల్ హైవే అథారిటీ పీడీ

- 7లో



నాణ్యమైన సేవలే లక్ష్యం

క్షేత్ర పర్యటనలు తప్పనిసరి

- జాప్యం లేకుండా సమస్యలు పరిష్కారించాలి
- ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరగాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం



జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలకు నాణ్యమైన సేవలందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, చింతూరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేశ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాపై తనకు పూర్తి అవగాహన ఉందని, అధికారుల తమ విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని, అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించనని హెచ్చరించారు. జిల్లా అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, తమ దృష్టికి వచ్చిన సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలన్నారు. సచివాలయాల సిబ్బందితో జిల్లా అధికారులు సమావేశాలు నిర్వహించి, సమర్థవంతంగా పని చేయాలన్నారు. విద్య, వైద్య సేవలు మెరుగుపడాలని, మలేరియా నిర్మూలనలో భాగంగా దోమల మందు పిచికారీ పనులు పక్కాగా నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామని, ఈ ఏడాది టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. అలాగే విద్యార్థుల ... మిగతా 8వ పేజీలో

నేటి నుంచి 'మీ కోసం'

పాడేరు ఐటీడీఏలో నిర్వహణ

- కలెక్టరేట్‌లో 24/7 వినతుల స్వీకరణ
- ఫిర్యాదుల స్వీకరణకు ఫోన్ నంబర్: 08935 293120

పాడేరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల సమస్యలపై వినతులను స్వీకరించేందుకు 'మీ కోసం' కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈమేరకు కలెక్టర్ దినేశ్‌కుమార్ అధికారులకు పలు సూచనలు చేశారు. గతంలో స్పందన పేరిట నిర్వహించే కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ 'మీకోసం' పేరిట నిర్వహించనుంది. అందులో భాగంగా పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో ప్రతి శుక్రవారం, రంపచోడవరం ఐటీడీఏలో సోమవారం, చింతూరు ఐటీడీఏలో బుధవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించి, ఆయా ప్రాంత ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారు.

కలెక్టరేట్‌లో నిరంతరం ఫిర్యాదుల స్వీకరణ

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రజల సమస్యలను నిరంతరం స్వీకరించేందుకు ఫోన్ నంబర్ 08935 293120 ఏర్పాటు చేశారు. 24 గంటలు ఈ ఫోన్‌లో కలెక్టరేట్ సిబ్బంది అందుబాటులో ఉంటారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలపై ఈ నంబర్‌కు కాల్ చేసి సమస్యలను తెలపవచ్చును. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

ఐటీడీఏ పీవోలు, సబ్‌కలెక్టర్లకు సమస్యలు పరిష్కరించే బాధ్యతలు

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏఎస్.దినేశ్‌కుమార్



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఎస్.దినేశ్‌కుమార్

పాడేరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని నూతన జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ప్రకటించారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్‌ను నేరుగా కలవచ్చని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఐటీడీఏ పీవోలు, సబ్‌కలెక్టర్లకు సైతం ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా బాధ్యతలు అప్పగిస్తామన్నారు. ప్రజలకు చక్కని సేవలు అందించే అధికారులను ప్రోత్సహిస్తామని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠినంగానే వ్యవహరిస్తామన్నారు. ప్రకాశం జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసిన తాను ఈ జిల్లాలో కూడా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టానన్నారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గతంలో రంపచోడవరం ఐటీడీఏ పీవోగా పనిచేయడంతో రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లలో స్థితిగతులపై సంపూర్ణ అవగాహన ఉందని ఏఎస్.దినేశ్‌కుమార్ చెప్పారు. గిరిజన ప్రాంతంలో విద్య, వైద్యం, రోడ్లు, కమ్యూనికేషన్‌తో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

అమ్మవారి పాదాలు, మోదకొండమ్మ దర్శనం

జిల్లా కేంద్రానికి వస్తున్న నూతన కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌కు ఘాట్‌లోని మోదాపల్లి కూడలి వద్ద జేసీ. భావన వశిష్ఠ, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే స్వాగతం పలికారు. ఆ తర్వాత అక్కడే అమ్మవారి పాదాలును కలెక్టర్ దర్శించుకుని, నేరుగా పాడేరులోని మోదకొండమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ తరఫున శాలువాలు కప్పి సత్కరించారు. తర్వాత కలెక్టరేట్‌కు చేరుకుని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్లు పి.ధాత్రిరెడ్డి, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

చింతపల్లి: రహదారి పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న చౌడుపల్లి వాగు



ముసురు

పాడేరు, అరకులోయ, చింతపల్లిలో భారీ వర్షం

- తడిచి ముద్దయిన ఏజెన్సీ ప్రాంతం
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు



సీలేరులో వాగును తలపిస్తున్న ప్రధాన రహదారి

పాడేరు/అరకులోయ/చింతపల్లి/కొయ్యూరు/సీలేరు/జీకేవీధి/జి.మాడుగుల/హుకుంపేట/ముంచంగిపుటు, జూన్ 27: మన్యంలో ముసురు వాతావరణం నెలకొంది. నైరుతి ప్రభావంతో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆకాశం మేఘావృతమైంది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రం పాడేరుతో సహా ఏజెన్సీ వ్యాప్తంగా వర్షం కురిసింది. ఈ వర్షానికి రోడ్లన్నీ జలయమం కాగా.. పంట పొలాల్లోకి వర్షం నీరు భారీగా చేరింది. ఏజెన్సీలోని హుకుంపేట రాళ్లగెడ్డ, పాడేరులోని బుంగాగెడ్డ, చిలకలమామిడిగెడ్డ, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో మత్స్యగెడ్డ, దుంబ్రిగుడలో చాపరాయిగెడ్డల్లోకి వర్షం నీరు వచ్చి చేరింది. శుక్రవారం సైతం ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ పేర్కొంది.

అరకులోయలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన వర్షం పడుతునే ఉంది. బుధవారం సాయంత్రం 3 గంటలకు మొదలైన వర్షం రాత్రి 9 గంటల వరకు పడింది. సాయంత్రం వేళల్లో వర్షం కురుస్తుండడంతో జనం ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వర్షం పడుతుండడంతో ఘాట్‌రోడ్‌లో వాహనచోదకులు రాకపోకలకు భయపడుతున్నారు.

చింతపల్లి మండలంలో గురువారం ఉదయం నాలుగు గంటల నుంచి రాత్రి వరకు కుండపోత వర్షం కురిసింది. వర్షం వల్ల జనజీవనం స్తంభించి పోయింది. రహదారులు వాగులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, వాగుల్లోకి వర్షపు నీరు భారీగా చేరుకున్నది. చెరువూరు, చౌడుపల్లి, తాజంగి, పెద్దగెడ్డ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.



అరకులోయలో వర్షం పడుతున్న దృశ్యం

కొయ్యూరు మండలంలో గడిచిన 20 గంటలుగా ముసురు వాతావరణం నెలకొంది. బుధవారం సాయంత్రం ప్రారంభమైన వర్షం గురువారం కొనసాగింది. మండల వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తున్నది. దీంతో రైతాంగం వరి ఆకుమడులు సిద్ధం చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

సీలేరులో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు కుండపోత వర్షం కురిసింది. వర్షం వల్ల ప్రధాన రహదారులు వాగులను తలపించాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది.

జీకేవీధి మండలంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు కుండపోతగా వర్షం పడుతునే ఉంది. భారీ వర్షంతో ప్రధాన రహదారులన్నీ వాగులను తలపిస్తున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పెదవలస వారపు సంతలో వర్తకులు, వినియోగదారులు ఇబ్బంది పడ్డారు.

జి.మాడుగుల మండలంలో గురువారం జోరు వాన కురిసింది. ఉదయం నుంచి కురిసిన వర్షానికి రహదారులు చిత్తడిగా మారాయి. ఇప్పటికే దుక్కు పనుల్లో నిమగ్నమైన రైతాంగానికి ఈ వర్షం ఉపయోగకరంగా ఉంది.

హుకుంపేట మండలంలో గురువారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఏకధాటిగా ఆరు గంటల వరకు భారీ వర్షం కురిసింది. కల్వర్టుల పైనుంచి వర్షపు నీరు ప్రవహించింది. దీంతో సర్వీసు ఆటోలు, ప్రైవేటు వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. పాఠశాలలకు ... మిగతా 8వ పేజీలో

నలుగురు మిలీషియా సభ్యులు లొంగుబాటు



జిల్లా ఎస్పీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు మిలీషియా సభ్యులు

కొయ్యూరు, జూన్ 27: గాలికొండ దళానికి చెందిన నలుగురు మిలీషియా సభ్యులు గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఎదుట లొంగిపోయారు. మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం..మండలంలోని నల్లబిల్లి గ్రామానికి చెందిన మిలీషియా కమాండర్ తాంబేలు సాయిరాం అలియాస్ డొంబు, అన్నవరం గ్రామానికి చెందిన వంతల కిరణ్, తాంబేలు రమేష్, జీకేవీధి మండలం దేవరాపల్లి పంచాయతీ తూములోవ గ్రామానికి చెందిన కొర్రా బాబూరావు అలియాస్ సీరులు లొంగిపోయిన వారిలో ఉన్నారు. ఈ నలుగురు గడిచిన తొమ్మిది సంవత్సరాలుగా గాలికొండ దళానికి చెందిన కాకురు పండన్న అలియాస్ జగన్, మర్రి వలసి అలియాస్ రామే, గెమ్మెలి కామేష్ అలియాస్ హరి మరికొందరి ప్రోద్బలంతో మిలీషియా సభ్యులుగా పనిచేస్తున్నారు. దళం వచ్చినపుడు వారికి చుట్టు పక్కల గ్రామాలకు దారులు చూపించడం, మీటింగ్‌లకు హాజరుకావడంతో పాటు జనసమీకరణ చేయడం, భోజన వసతి సమకూర్చడం వంటివి చేసేవారన్నారు. అంతేకాకుండా తాంబేలు సాయిరాం 2021లో తీగలమెట్ట అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పులు, 2019లో చింతవానిపాలెం, బాలరేవుల గ్రామాల్లో కరపత్రాలు చల్లిన ఘటనలో పాల్గొన్నాడన్నారు. వంతల కిరణ్ తీగలమెట్ట ఎదురుకాల్పులు అనంతరం తప్పించుకున్న వలసితో పాటు మరికొందరు మావోయిస్టులకు ఆశ్రయం కల్పించడం, 2020లో కన్నవరంలో మావోయిస్టులు ఏర్పాటుచేసిన ప్రజాకోర్టులో పాల్గొనడం, కరపత్రాలు చల్లడం చేసేడన్నారు. తాంబేలు రమేష్ 12 కేసులలో నిందితుడిగా ఉన్నాడన్నారు. మరో మిలీషియా సభ్యుడు కొర్రా బాబూరావు 2010లో తీములబంద కాఫీ గొడౌన్ పేల్చిన ఘటనలో ఉన్నాడన్నారు. వరుస ఎదురుకాల్పులు, సరండర్లు, గాలికొండ ఏరియాలో దిశానిర్దేశం చేసే నాయకత్వం లేకపోవడం, కమ్యూనిటీ పోలీసింగ్‌లో ... మిగతా 8వ పేజీలో

జీకే వీధి ఐసీడీఎస్ ఆఫీస్‌కు సొంత గూడు కలేనా?

నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.53 లక్షలు విడుదల

- భవన నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని పంచాయతీరాజ్ అధికారులు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో దృష్టి సారించని పాలకులు
- కారిపోతున్న ప్రస్తుత కార్యాలయం
- తడిసిపోతున్న రికార్డులు, అంగన్‌వాడీల సరుకులు



అసంపూర్తిగా ఉన్న ఐసీడీఎస్ నూతన భవనం

గూడెంకొత్తవీధి, జూన్ 27: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి సొంత గూడు కలగా మిగిలింది. నాలుగేళ్ల క్రితం కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేసిన భవనం పూర్తికి వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. దీంతో కారిపోతున్న రేకుల షెడ్డులో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం హయాంలో అసంపూర్తి భవనానికి కదలిక వస్తుందని ఉద్యోగులు, స్థానికులు ఎదురుచూస్తున్నారు.

చింతపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న జీకేవీధి మండలాన్ని విడదీసి నూతన ఐసీడీఎస్ ప్రాజెక్టును 2013 సంవత్సరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి కొత్త భవనం లేకపోవడంతో అప్పట్లో రెవెన్యూ కార్యాలయాల సముదాయంలో రేకుల షెడ్డును అధికారులు కేటాయించారు. ఐసీడీఎస్ అధికారులు భవనం పైకప్పు బాగు చేసుకుని, గోడలకు రంగులు వేసుకుని కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. ఐదేళ్ల కిందట జీకేవీధి ఐసీడీఎస్ కార్యాలయానికి నూతన భవనం నిర్మాణానికి గత తెలుగుదేశం ప్రభుత్వం రూ. 53 లక్షలను మంజూరు చేసింది. భవన నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖకు అప్పగించింది. టెండర్ ద్వారా దక్కించుకున్న కాంట్రాక్టర్ తొమ్మిది నెలల్లో పూర్తి చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. సంబంధిత కాంట్రాక్టర్ ఐసీడీఎస్ కార్యాలయం నూతన భవనం శ్లాబ్ వరకు నిర్మించాడు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.53 లక్షల్లో దాదాపు 95 శాతం నిధులను కాంట్రాక్టర్ డ్రా చేసుకున్నాడు. అయితే భవనం నిర్మాణ పనులను ఇప్పటి వరకు పూర్తి చేయలేదు.

భవనం పూర్తయ్యేనా..?

ఐసీడీఎస్ కార్యాలయం నూతన భవనం అసంపూర్తి నిర్మాణాలతో కాంట్రాక్టర్ వదిలేసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం హయాంలో పాలకులు, పంచాయతీరాజ్ అధికారులు కనీసం పట్టించుకోలేదు. సొంత భవనం కోసం ఐసీడీఎస్ ఉద్యోగులు ఎదురుచూస్తూ కారిపోతున్న రేకుల షెడ్డులో అవస్థలు పడుతున్నారు. వర్షం వస్తే కారిపోతుండడంతో కార్యాలయ రికార్డులు తడిసిపోతున్నాయి. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన సరుకులు కూడా తడిపోతున్నాయి. దీంతో ఆ సరుకులు తడవకుండా టార్పాలిన్ కప్పి కాపాడుతున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుకు శాశ్వత భవనం లేక ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణనాతీతం. నూతన భవన నిర్మాణ బాధ్యతలు పొందిన కాంట్రాక్టర్ 95 శాతం నిధులను డ్రా చేసుకుని పనులను అర్ధంతరంగా నిలిపివేసిన కాంట్రాక్టర్‌పై ఇంజనీరింగ్ అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోలేదు. మండల కేంద్రంలో నాలుగేళ్లుగా అసంపూర్తిగా ఉన్న ఈ భవనం పూర్తికి పంచాయతీరాజ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిలిచిపోయిన ఐసీడీఎస్ కార్యాలయానికి కదలిక వస్తుందని ఉద్యోగులు, స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ పీజీ సెట్‌లో బలరాంకు 8వ ర్యాంకు

ఫెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబరిచిన కొర్రా



కొర్రా బలరాం

అరకులోయ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎంట్రన్ టెస్ట్ (ఏపీ పీజీసెట్-2024) ఫలితాలను ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు గురువారం సాయంత్రం విడుదల చేశారు. ఏపీ పీజీసెట్ ఫలితాల్లో అరకులోయ మండలంలోని పద్మాపురానికి చెందిన కొర్రా బలరాం ఫెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్‌లో 8వ ర్యాంకు సాధించాడు. ఈయన తండ్రి అరకులోయలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సబ్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తనకు 8వ ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉందని బలరాం పేర్కొన్నారు. కూచిపూడి నృత్యంలో ఆంధ్రా యూనివర్సిటీలో పీజీ కోర్సు చేస్తానన్నారు. కూచిపూడి నృత్య కళాకారుడుగా ఎదగాలన్నదే లక్ష్యమన్నారు.

ఎడ్‌సెట్‌లో తేజ రేష్మకు 5వ ర్యాంకు

ప్రతిభ కనబరిచిన సీలేరు విద్యార్థిని



తేజ రేష్మ

సీలేరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్-2024 ఫలితాలను గురువారం మధ్యాహ్నం విడుదల చేశారు. ఐదు సబ్జెక్టుల్లో ప్రవేశాలకు ఈనెల ఎనిమిదో తేదీన రాత పరీక్ష నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జీకేవీధి మండలం సీలేరుకు చెందిన తేజ రేష్మ ఏపీ ఎడ్‌సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు సాధించింది. సీలేరు జెన్‌కో ఉద్యోగి చిటికెల సత్యనారాయణ కుమార్తె తేజ రేష్మ. పీజీ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదివింది. తేజ రేష్మను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రైం... crime news

15 కిలోల గంజాయి పట్టివేత

ముంచంగిపుట్టు, జూన్ 27: మండలంలోని కుజబంగి జంక్షన్ వద్ద గురువారం స్థానిక పోలీసులు 15 కిలోల గంజాయితో పాటు ముగ్గురు గంజాయి స్మగ్లర్లను పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఎస్ఐ కె.రవీంద్ర తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కుజబంగి జంక్షన్ వద్ద ఏఎస్ఐ తిరుపతి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఆ సమయంలో అటుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఆపి తనిఖీ చేయగా 15 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో రెండు ద్విచక్ర వాహనాలను, ముగ్గురు గంజాయి స్మగ్లర్లను పట్టుకున్నారు. పట్టుబడిన స్మగ్లర్లు తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా చెర్లపల్లి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కర్రి శ్రీశైలం, అల్లూరి జిల్లా హుకుంపేట మండలం కామయ్యపేట గ్రామానికి చెందిన కొర్రా సీతారాం, ఒడిశా రాష్ట్ర మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ మెట్టగూడ గ్రామానికి చెందిన పాంగి సుంద్రులుగా విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు. ద్విచక్ర వాహనాలపై గంజాయిని విశాఖపట్నం తరలించేందుకు వారు ప్రయత్నించినట్టు తెలిసిందన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నాగేశ్, పడాల్ పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగిక దాడి కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

విశాఖపట్నం (లీగల్), జూన్ 27: చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది గురువారం తీర్పు చెప్పారు. బాధితురాలికి నిందితుడు రూ.లక్ష పరిహారంగా అందించాలని తీర్పులో పేర్కొన్నారు. దిశా పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని మర్రిపాలేనికి చెందిన అప్పన్న (45) విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. 2021 జూలై ఒకటో తేదీన ఓ వీధిలో ఆడుకుంటున్న చిన్నారిని తన ఇంటికి పిలిచి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. దిశ పోలీస్ స్టేషన్ అధికారి ప్రేమ్‌కాజల్, డీసీపీ వివేకానంద దర్యాప్తు చేసి కోర్టులో నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం నిందితుడు నేరం చేసినట్టు రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. బాధితురాలికి ప్రభుత్వం తరఫున రూ.3 లక్షలు పరిహారంగా అందించాలని తీర్పులో పేర్కొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

» సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్‌పై కేసులు

అనకాపల్లి టౌన్, జూన్ 27 : పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై ట్రాఫిక్ పోలీసులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది నెహ్రూచౌక్, ఎన్టీఆర్ జంక్షన్, రింగురోడ్డు జంక్షన్‌ల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. సీఐ పైడపునాయుడు నెహ్రూచౌక్‌లో తన సిబ్బందితో ఎవరైనా సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసినా, ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణించినా కేసులు నమోదు చేశారు. అలాగే ఎస్ఐలు కూడా సిబ్బందితో ప్రధాన జంక్షన్‌ల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో 36 మందిపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.23వేలు జరిమానా విధించామని సీఐ పైడపునాయుడు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన పది మందిని కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. మరోసారి ఈ విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ పైడపునాయుడు వాహనచోదకులకు స్పష్టం చేశారు.

తిరుపతి, సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, జూన్ 27: విశాఖ, సికింద్రాబాద్, తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లతోపాటు విశాఖ మీదుగా బెంగళూరు, న్యూ టిన్సుకియా మధ్య ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-సికింద్రాబాద్-విశాఖ

08579 నంబరు గల రైలు జూలై మూడు నుంచి ఆగస్టు 28 వరకు ప్రతి బుధవారం రాత్రి 7 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 8.20 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08580 నంబరు గల రైలు జూలై నాలుగు నుంచి ఆగస్టు 29వ తేదీ వరకు ప్రతి గురువారం రాత్రి 7.40 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 6.40 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-తిరుపతి-విశాఖ

08583 నంబరు గల రైలు జూలై ఒకటి నుంచి ఆగస్టు 26 వరకు ప్రతి సోమవారం రాత్రి 7 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08584 నంబరు గల రైలు జూలై రెండు నుంచి ఆగస్టు 27 వరకు ప్రతి మంగళవారం రాత్రి 9.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి మర్నాడు ఉదయం 10.15 గంటలకు విశాఖ చేరుతుంది.

న్యూ టిన్సుకియా-బెంగళూరు

05952 నంబరు గల రైలు జూలై నాలుగు నుంచి అక్టోబరు 31 వరకు ప్రతి గురువారం సాయంత్రం 6.45 గంటలకు న్యూ టిన్సుకియాలో బయలుదేరి మూడో రోజు (శనివారం) మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ, ఆ మరుసటి రోజు ఉదయం (ఆదివారం) ఉదయం 9 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 05951 నంబరు గల రైలు జూలై ఎనిమిది నుంచి నవంబరు నాలుగు వరకు ప్రతి సోమవారం 00.30 (ఆదివారం అర్ధరాత్రి 12.30) గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి సోమవారం రాత్రి 9.40 గంటలకు విశాఖ, బుధవారం మధ్యాహ్నం 1.15 గంటలకు న్యూ టిన్సుకియా చేరుతుంది.

ముత్యాలమ్మపాలెం తీరంలో చేపల మృతిపై విచారణ

» ఉప్పుటేరును పరిశీలించిన ఎన్ఐఓ శాస్త్రవేత్తలు

» నాలుగుచోట్ల నీటి నమూనాలు సేకరణ



స్థానికులతో మాట్లాడుతున్న ఎన్ఐఓ శాస్త్రవేత్తలు, పీసీబీ అధికారులు

పరవాడ, జూన్ 27 : ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరును నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓస్నోగ్రఫీ (ఎన్ఐఓ) శాస్త్రవేత్తలతో పాటు పీసీబీ అధికారులు గురువారం పరిశీలించారు. రెండు రోజుల క్రితం ఉప్పుటేరులో భారీ ఎత్తున చేపలు మృతి చెందిన సంగతి తెలిసిందే. చేపల మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు ఎన్ఐఓ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎంఎస్ కృష్ణ, సీనియర్ సైంటిస్ట్ ఎల్. జగదీషన్, పీసీబీ ఈఈ పీవీ ముకుందరావు తమ సిబ్బందితో కలిసి ఉప్పుటేరు పరిసర ప్రాంతాల్లో కలియ తిరిగారు. నాలుగు చోట్ల నీటి నమూనాలను సేకరించారు. వీటిని ల్యాబ్‌లో పరీక్షలు జరిపిన అనంతరం చేపలు ఎందువల్ల మృతి చెందాయన్న విషయాన్ని వారం రోజుల్లోగా కారణాలను వెల్లడిస్తామని పీసీబీ ఈఈ తెలిపారు. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. గతంలో ఫార్మా కాలుష్యం కారణంగా ప్రజలకు నష్టం వాటిల్లి నేపథ్యంలో నాలుగు ఫార్మా పరిశ్రమలకు రూ.50లక్షలు జరిమానా వేసిన విషయాన్ని ఈ సందర్భంగా పీసీబీ ఈఈ గుర్తు చేశారు. ఈ సంఘటనలో కూడా ఫార్మా పొల్యూషనే కారణమైతే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఓ, పీసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

ఎన్నాళ్లీ చెట్ల కింద చదువులు

» వర్షాకాలం నాలుగు నెలలు బడికి సెలవే..?

» స్పందించని అధికారులు..

» పట్టించుకోని ప్రజాప్రతినిధులు

స్వాతంత్ర్యం వచ్చి 77ఏళ్లు పూర్తయినా గిరిజన గ్రామాల్లో తప్పని తిప్పలు



చెరకుపల్లిలో చెట్లకింద విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు



శిథిలావస్థలో ఉన్న పాఠశాల పాక



పునాది వరకే నిర్మించిన పాఠశాల భవనం

చీడికాడ, జూన్ 27: మండలంలోని కోనాం శివారు చెరకుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాలలో గిరిజన విద్యార్థులకు ఇప్పటికీ చెట్టు కింద చదువులు తప్పడం లేదు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలకు అన్ని వసతులతో కూడిన పక్కా భవనాలు నిర్మిస్తామని, ప్రతి ఎన్నికల ముందు వాగ్దానాలు చేస్తున్న వివిధ పార్టీల నాయకుల హామీలు అమలు కావడం లేదు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడులో నిధులు పూర్తిస్థాయిలో కేటాయించకపోవడంతో ప్రభుత్వ భవన నిర్మాణాలు పునాదుల వరకే పరిమితమయ్యాయి. చెరకుపల్లి గిరిజన గ్రామంలో 1నుంచి 5వ తరగతి వరకూ 25 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. పాఠశాల నిర్వహణకు సొంత భవనం లేకపోగా గ్రామస్థులు చిన్న కమ్మలపాక నిర్మించారు. వర్షం వస్తే దీనిలో పిల్లలు కూర్చొనేందుకు అవకాశం లేకపోగా ఉపాధ్యాయులు కూర్చొనేందుకు సైతం అవకాశం లేదు. దీంతో వర్షాకాలం నాలుగు నెలల కాలంలో వర్షం వచ్చినపుడల్లా విద్యార్థులు ఉపాధ్యాయులకు చెప్పకుండా తమ గృహాలకు వెళ్లిపోతున్నారు. దీంతో ఉపాధ్యాయులు చేసేది లేక పాఠశాల కాలం పూర్తయ్యేవరకూ గ్రామంలో ఉండి అనంతరం స్వగ్రామాలకు వెళ్లిపోతున్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు రెండో ఫేజ్‌లో ప్రభుత్వ పాఠశాల భవనం, వంటషెడ్డు, మరుగుదొడ్లు నిర్మాణానికి రూ.33లక్షలు మంజూరు చేసి, రూ.8.5లక్షల గ్రాంట్ విడుదల చేశారు. ఈ గ్రాంట్‌తో పాఠశాల భవనం పునాది వరకూ స్కూల్ కమిటీ, పాఠశాల హెచ్ఎం సంయుక్తంగా నిర్మించగా వంటషెడ్డు, మరుగుదొడ్డి నిర్మాణం శ్లాబువరకూ చేశారు. మిగతా నిర్మాణానికి నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో పిల్లలకు ఈ ఏడాది కూడా చెట్ల కిందే చదువులు చెప్పవలసిన దుస్థితి నెలకొంది. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరహామూర్తిని వివరణ కోరగా..వర్షం వచ్చినపుడల్లా కొంతమంది పిల్లలను కమ్మల పాకలోను, మరికొంతమందిని గ్రామం మధ్యలో చర్చి కోసం నిర్మించిన షెడ్డులో పెట్టి తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

అగనంపూడి టోల్‌గేట్‌పై రగడ

» ముదురుతున్న వివాదం

» అగనంపూడి వద్ద టోల్ బూత్‌లు ధ్వంసం

» పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసిన నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్

» టోల్‌గేట్ నిర్వహణను గడిచిన కొన్నేళ్లుగా వ్యతిరేకిస్తున్న స్థానికులు

» గతంలో హైకోర్టుకు వెళ్లిన గాజువాక బార్ అసోసియేషన్

» న్యాయస్థానంలో తీర్పు సానుకూలంగా రావడంతో టోల్‌గేటు మూసివేత

» కొన్నాళ్లకే మళ్లీ పునరుద్ధరణ

» సుప్రీంకోర్టు ఆదేశాల మేరకేనంటున్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు

» రూ.1200 కోట్లతో నగరంలో 12 ఫ్లై ఓవర్ల నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేసినట్టు వెల్లడి

» టోల్‌గేట్ తొలగిస్తే ఆ పనులకు బ్రేక్ పడుతుందని వాదన



బూత్‌లు ధ్వంసమైన తరువాత అగనంపూడి టోల్‌గేటు ఇలా..

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి టోల్‌గేట్ వివాదం రోజురోజుకూ ముదురుతోంది. స్థానికులు, కూటమి కార్యకర్తలు టోల్‌గేట్ లేకుండా చేయాలని చూస్తుండగా, కొనసాగించేందుకు నేషనల్ హైవే అథారిటీ అధికారులు యత్నిస్తున్నారు. రెండు రోజుల కిందట స్థానికులు టోల్‌గేట్ వద్ద ఆందోళన నిర్వహించడంతో పాటు స్టాపర్లను తొలగించి, ఫీజు వసూలు చేయకుండా సిబ్బందిని అడ్డుకున్నారు. బుధవారం రాత్రి కొందరు జేసీబీలు, ఇతర యంత్రాలను వినియోగించి టోల్‌గేట్ వద్ద బూత్‌లను తొలగించేశారు. అక్కడ టోల్ గేట్ ఆనవాళ్లు కూడా లేకుండా చేశారు. బూత్‌ల ధ్వంసం చేయడంతోపాటు టోల్‌గేట్‌ను పూర్తిగా తొలగించడంపై పోలీసు అధికారులకు గురువారం ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ రంజన్ ఫిర్యాదు చేశారు. అదేసమయంలో నేషనల్ హైవే అథారిటీ చైర్మన్‌కు కూడా సమాచారం తెలియజేశారు.

వివాదం ఏమిటి..?

అగనంపూడి వద్ద 1997లో నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో టోల్‌గేట్‌ను ఏర్పాటుచేశారు. అయితే, గడిచిన కొన్నాళ్లుగా ఈ టోల్‌గేట్‌ను తొలగించాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో టోల్‌గేట్ ఏర్పాటు నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటున్నారు. ఈ టోల్‌గేట్ వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, ఆర్థికంగా భారం మోయాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కూడా గతంలో పోరాటం చేశారు. 2019లో గాజువాక బార్ అసోసియేషన్ టోల్‌గేట్‌ను తొలగించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించింది. బార్ అసోసియేషన్ వాదనలను విన్న హైకోర్టు టోల్‌గేటు తొలగింపునకు ఆదేశాలు ఇచ్చినట్టు స్థానికులు చెబుతున్నారు. కొద్దినెలలపాటు టోల్‌గేటును మూసివేశారు. అయితే, హైకోర్టు తీర్పుపై నేషనల్ హైవే అథారిటీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు టోల్‌గేటును కొనసాగించేందుకు అనుమతి ఇవ్వడంతోపాటు 2019 జూలైలో మళ్లీ పునరుద్ధరించారు. దీనిపై అప్పటి నుంచి స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని పూర్తిగా విస్మరించింది. స్థానిక ఎమ్మెల్యే కూడా పట్టించుకోలేదు. 2024 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఇక్కడి నుంచి పోటీ చేసిన పల్లా శ్రీనివాసరావు కూటమి అధికారంలోకి వస్తే టోల్‌గేటును తొలగించేలా చేస్తామని హామీ ఇచ్చారు. తమ ఎంపీలు సహకారంతో అందుకోసం ప్రయత్నం చేస్తామన్నారు. ఇదిలావుండగా స్థానికులు, కూటమి నాయకులు మంగళవారం రాత్రి టోల్‌గేటు వద్ద ఆందోళనకు దిగారు. వాహనాలను నియంత్రించేందుకు వీలుగా ఏర్పాటుచేసిన స్టాపర్లను తొలగించేశారు. ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదంటూ వాహనాలను పంపించేశారు. టోల్‌గేటు కొనసాగింపునకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బుధవారం రాత్రి పూర్తిగా టోల్‌గేట్‌ను తొలగించేశారు.

ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల వాదన ఇదీ..

స్థానికులు వాదన ఇలా ఉండగా...నేషనల్ హైవే అథారిటీ అధికారులు మాత్రం అందుకు భిన్నంగా చెబుతున్నారు. నేషనల్ హైవే నిర్వహణ బాధ్యతను తామే చూస్తున్నామని, ఇందుకోసం ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామంటున్నారు. జీ20 సదస్సు నేపథ్యంలో నేషనల్ హైవేపై ఉన్న గుంతలు పూడ్చేందుకు, ఇతరత్రా పనులకు రూ.15 కోట్లు ఖర్చు చేశామంటున్నారు. అలాగే, నగరం నుంచి జాతీయ రహదారి వెళుతున్న నేపథ్యంలో లంకెలపాలెం, గాజువాక, స్టీల్‌ప్లాంటు జంక్షన్, తాటిచెట్లపాలెం, మద్దిలపాలెం, హనుమంతువాక, పీఎం పాలెం కార్‌షెడ్‌తోపాటు మొత్తం 12 చోట్ల ఫ్లై ఓవర్లు నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ పూనుకుందని, రూ.1200 కోట్లతో డీపీఆర్ కూడా సిద్ధం చేసినట్టు చెబుతున్నారు. రోడ్ల నిర్వహణతోపాటు బ్రిడ్జిల రిపేర్లు, బస్ బే, లారీ బేల నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నామని. ఇదంతా టోల్ ఫీజు ద్వారా వస్తున్న ఆదాయంతోనే చేస్తున్నట్టు వెల్లడించారు. ఆ టోల్‌గేటును తొలగిస్తే ఈ పనులన్నీ నిలిచిపోతాయంటున్నారు. ఈ టోల్‌గేటు గుండా ప్రతిరోజూ 45 వేల పాసింజర్ వెహికల్ యూనిట్లు (పీసీయు) ప్రయాణిస్తుంటాయని, వీటి ద్వారా రోజుకు రూ.20 లక్షల వరకు ఆదాయం సమకూరుతోందన్నారు. టోల్‌గేటు తొలగిస్తే రోడ్డు నిర్వహణ నుంచి ఇతర పనులన్నీ నిలిచిపోయే అవకాశముందన్నారు. బుధవారం రాత్రి టోల్‌గేటును పూర్తిగా తొలగించడం వల్ల కోటి రూపాయలకుపైగా నష్టం వాటిల్లినట్టు అధికారులు చెబుతున్నారు. ఒక్కో బూత్ ఏర్పాటుకు రూ.10 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. టోల్‌గేట్‌ను పూర్తిగా తొలగించిన విషయాన్ని చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లామని, వారి నిర్ణయం మేరకు నడుచుకుంటామని స్థానిక అధికారులు వెల్లడించారు.

సొరంగాల నిర్మాణం పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

విశాఖపట్నం, జూన్ 27: కొత్తవలస, కిరండోల్ లైను (కేకే లైను) అరకు సెక్షన్‌లోని బొడ్డవర, శివలింగపురం స్టేషన్ల మధ్య 1.4 కి.మీ మేర జరుగుతున్న సొరంగ మార్గ నిర్మాణ పనులను డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ గురువారం పరిశీలించారు. మొత్తం ఆరు సొరంగాలలో ఇది నాలుగో సొరంగమని, కాండోలైట్ రాళ్లు, మట్టితో కూడిన ఇసుక రాయి కలిగిన ఈ ప్రాంతంలో సొరంగ నిర్మాణం కఠినంగా మారినా పనులు వేగవంతం చేయడంతో పురోగతి సాధించామన్నారు. ఈ ప్రాంతంలో రైల్వే రవాణా సామర్థ్యం పెంచడంతోపాటు వేగవంతం చేయడానికి దోహదపడుతుందన్నారు. కేకే లైనులో 189 కి.మీ పొడవున డబ్లింగ్ పనులు చేపట్టగా ఇప్పటి వరకు 96.45 కి.మీ మేర పూర్తకాగా, ఆగస్టు నాటికి 100 కి.మీ డబ్లింగ్ పనులు పూర్తయ్యే అవకాశముందన్నారు. సరకు రవాణా కార్యకలాపాలను క్రమబద్ధీకరించడంలో భాగంగా సొరంగాల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ పర్యటనలో ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రాజీవ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా విశాఖ జిల్లా జేసీ



మయూర్ అశోక్

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిగా విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో బ్యాంకు ఇన్‌చార్జి చైర్మన్‌గా ఉన్న కోలా గురువులు ఇరవై రోజుల క్రితం రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో ఏడుగురు సభ్యులతో కూడిన నాన్ అఫీషియల్ ఛైర్‌పర్సన్ ఇన్‌చార్జి కమిటీ రద్దయ్యింది. దాంతో డీసీసీబీలో పాలనాపరమైన ఇబ్బందులు వచ్చాయి. దాదాపు ఇదే సమస్య మిగిలిన జిల్లాల్లో తలెత్తడంతో డీసీసీబీ బాధ్యతలు జేసీలకు అప్పగిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. విశాఖ డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

నూకాంబిక ఆలయ హుండీ ఆదాయం రూ.50 లక్షలు

అనకాపల్లి టౌన్, జూన్ 27: స్థానిక నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు ఆలయ ఆవరణలో గురువారం జరిగింది. హుండీల్లో నగదు 50 లక్షల ఒక వెయ్యి 327 రూపాయలను భక్తులు వేశారని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. అలాగే 30 గ్రాముల బంగారం, ఒక కిలో 200 గ్రాముల వెండి అమ్మవారికి సమర్పించారన్నారు. హుండీ లెక్కింపు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్ పర్యవేక్షణలో జరిగిందన్నారు. హుండీల లెక్కింపులో దేవస్థానం సిబ్బంది, పూజారులు, శ్రీవారి సేవ సభ్యులు, యూనియన్ బ్యాంక్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో జిల్లా విద్యార్థుల సత్తా

రాష్ట్రవ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎంట్రన్ టెస్ట్ (ఏపీ పీజీసెట్-2024) ఫలితాలను ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు గురువారం సాయంత్రం విడుదల చేశారు. ఇందులో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటాడు. ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించారు.

గ్రూపు-1 సాధించడమే లక్ష్యం



మాది బుచ్చెయ్యపేట మండలం లైపురం. అమ్మ చనిపోయింది. నాన్న వ్యవసాయం చేస్తుంటారు. లైపురంలో ప్రాథమిక విద్య, రాజాం జడ్పీ హైస్కూల్‌లో ప్రాథమికోన్నత విద్య అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో ఇంటర్మీడియట్, విశాఖ ఏయూలో బీకాం కామర్స్ చదివా. పీజీ సెట్‌లో ఐదవ ర్యాంకు రావడంతో ఏయూలో హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో పీజీ చేస్తా. గ్రూప్-1 సాధించడమే నా లక్ష్యం.

- యాదగిరి సురేశ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో 5వ ర్యాంకు

జియాలజిస్టుని అవుతా..



మాది చోడవరం పట్టణ శివారు నరసయ్యపేట పంచాయతీ. నాన్న గోవిందరావు శ్రీవిజ్ఞాన్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నారు. అమ్మ నాగలక్ష్మి గృహిణి. పదవ తరగతి వరకు శ్రీ విజ్ఞాన్‌లో, ఇంటర్మీడియట్ విశాఖలో, డిగ్రీ భీమవరం డీఎన్ఆర్ కాలేజీలో చదివా. జియాలజిస్టుగా మంచి పేరు తెచ్చుకోవాలన్నదే లక్ష్యం.

- ఉగ్గిన సౌమ్య, జియాలజీలో 5వ ర్యాంకు

ఏయూలో ఎంఏ హిస్టరీ చేస్తా..



మాది నర్సీపట్నం. నాన్న లక్ష్మణరావు పెయింటర్‌గా, అమ్మ సరోజిని కూలి పనులు చేస్తుంటారు. పదవ తరగతి వరకు పెదబొడ్డేపల్లి సెయింట్ ఆన్స్ స్కూల్‌లో, ఇంటర్మీడియట్ విశాఖలో, డిగ్రీ నర్సీపట్నంలోని ఏబీఎం డిగ్రీ కళాశాలలో చదివా. పీజీ సెట్‌లో మూడో ర్యాంకు రావడానికి నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలోని పుస్తకాలు ఎంతగానో దోహదపడ్డాయి. ఏయూలో ఎంఏ హిస్టరీ చేయాలని అనుకుంటున్నా.

- రెడ్డి మోహన్, ఎంఏ(హిస్టరీ) మూడో ర్యాంకు

సైంటిస్టును అవుతా..



మాది పాయకరావుపేట. నాన్న షేక్ మస్తాన్ బాషా దక్కన్ కెమికల్స్ ఉద్యోగి. అమ్మ మజిద గృహిణి. గాజువాకలోని చైతన్య ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో చదివా. లైఫ్ సైన్సెస్‌లో 4వ ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. సైంటిస్ట్ కావాలన్నదే నా లక్ష్యం.

- అర్షియా ఆఫీరి షేక్, లైఫ్ సైన్సస్‌లో 4వ ర్యాంకు

ఎడ్‌సెట్‌లో ఉమ్మడి జిల్లా విద్యార్థుల ప్రతిభ

» ఫిజిక్స్‌లో పాయకరావుపేట విద్యార్థినికి ప్రథమ ర్యాంకు

» బయాలజీ, ఇంగ్లీష్‌లలో నగర విద్యార్థులకు మూడో ర్యాంకు

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో బీఈడీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎడ్‌సెట్‌లో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలువురు మంచి ప్రతిభచూపారు. ఫిజిక్స్‌లో పాయకరావుపేటకు చెందిన కాశిన వీరసాయి చంద్రిక 100 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించింది. బయాలజీలో సాగర్‌నగర్‌కు చెందిన పప్పల మానస సాయిలక్ష్మి 88 మార్కులతో మూడో ర్యాంకు, భానోజీనగర్‌కు చెందిన సీహెచ్ మేరీ వేలంగిణి 83 మార్కులతో ఏడో ర్యాంకు, ఇంగ్లీష్‌లో నగరంలోని దసపల్లా హిల్స్‌కు చెందిన డి.టాల్కుదర్ 109 మార్కులతో మూడో ర్యాంకు, సబ్బవరానికి చెందిన బి.ఏక్షితనాయుడు 98 మార్కులతో ఆరో ర్యాంకు, సోషల్ స్టడీస్‌లో కోటవురట్ల మండలం కొత్తూరుకు చెందిన ఎం.శ్రావణి 89 మార్కులతో ఆరో ర్యాంకు సాధించారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

» ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జూన్ 27 : జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఒక ప్రకటనలో సూచించారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ఈనెల 29న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. లోక్‌అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్ వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసుల్లో కోర్టు వారు ఇచ్చిన నివేదిక, జిల్లా పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల్లో నమోదైన కేసుల ప్రకారం రాజీ పడడానికి అవకాశం ఉన్న కేసుల్లో కక్షిదారులకు నోటీసులు జారీ చేశారన్నారు. ఇరుపక్షాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి లోక్‌అదాలత్ గురించి అవగాహన కల్పించి, వారి సమ్మితతో కేసులు పరిష్కారానికి ప్రయత్నించాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని పోలీస్ అధికారులను సూచించారు.

పంచాయతీ శిలాఫలకం ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు

అచ్యుతాపురం, జూన్ 27: పంచాయతీ శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ బుచ్చిరాజు తెలిపారు. ఇరువాడ పంచాయతీ భవనానికి గతంలో శిలాఫలకం ఏర్పాటుచేశారు. ఈ శిలాఫలకంలో వైసీపీకి చెందిన నాయకుల పేర్లు ఉన్నాయి. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, శిలాఫలకంలో పేర్లు ఎందుకు మార్చలేదంటూ మద్యం మత్తులో ముగ్గురు ధ్వంసం చేశారు. దీంతో సర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కారణంగా ఇరువాడకు చెందిన బడితెబోయిన ప్రసాద్, పీతా రాము, రేవిడి దుర్గాప్రసాద్‌లపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ బుచ్చిరాజు తెలిపారు.

'ఉపాధి' ద్వారా తొలి విడతగా 801 ఎకరాల్లో ఉద్యానవన పంటలు

» ఏపీవో లక్ష్మీనారాయణమూర్తి



చల్లాయిలో ఉద్యాన పంటల మొక్కల నాట్లు పరిశీలిస్తున్న ఏపీవో లక్ష్మీనారాయణ మూర్తి

చింతపల్లి, జూన్ 27 : మండలంలో తొలి విడతగా జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం ద్వారా 801 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేపడుతున్నట్టు ఏపీవో కొక్కుల లక్ష్మీనారాయణ మూర్తి తెలిపారు. గురువారం మండలంలోని కొమ్మంగి పంచాయతీ పరిధిలోని చల్లాయి, కొలపరి, రౌరింతాడ గ్రామాల్లో రైతుల పంట పొలాల్లో ఉద్యాన పంట మొక్కల నాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ గిరిజన ప్రాంతం అరుదైన ఉద్యాన పంట సాగుకు అనుకూలమని గుర్తించడంతో రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రధానంగా డ్రాగన్ ఫ్రూట్, అవకడో, సీతాఫలం, నిమ్మ, జామ, జీడిమామిడి తోపాటూ సిల్వర్ ఓక్ మొక్కలు అందజేస్తున్నామన్నారు. ఒకొక్క రైతుకు అరెకరం నుంచి ఎకరం విస్తీర్ణంలో నాట్లు వేయిస్తున్నామన్నారు. మండలంలో 1800 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగుకి ప్రతిపాదనలు పంపించామన్నారు. తొలి విడతగా 801 ఎకరాలకు అనుమతి వచ్చిందన్నారు. రైతులకు నాణ్యమైన మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. మూడేళ్లపాటు సాగుకు అవసరమైన ప్రోత్సాహం అందజేస్తామన్నారు. అలాగే ఉపాధి కూలీలకు 100 రోజుల పని కల్పిస్తున్నామన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ భూములు కలిగిన కూలీలకు 150రోజుల పనిదినాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ మధుసూదన్ పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే రేషన్ సరుకులు

» రాష్ట్ర గిరిజన సంఘం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్ర, రాంబాబు

పాడేరు రూరల్, జూన్ 27 : అల్లూరి జిల్లా గిరిజన ప్రాంతంలో జీసీసీ ద్వారా పాత పద్ధతిలోనే మొబైల్ వాహనంలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కిల్లో సురేంద్ర, లోత రాంబాబు డిమాండ్ చేశారు. గిరిజన సంఘం భవనంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో ఉన్న గిరిజన ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటులోకి తెచ్చేందుకు గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలో 221 మొబైల్ వాహనాల ద్వారా 442 మందిని నియమించి ఆదివాసీ గిరిజన గ్రామాల్లో రేషన్ సరఫరా చేసేవారన్నారు. దీనివల్ల 442 మందికి ఉపాధి కలగడంతో పాటు ఆదివాసీలు ప్రతీ నెల రేషన్ కోసం డీఆర్ డిపోల వద్దకు సుమారు 10 నుంచి 15 కిలోమీటర్లు దూరం నడిచి వెళ్లాల్సిన శ్రమ ఉండేది కాదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మొబైల్ రేసన్ సరఫరా విధానానికి స్వస్తి పలికి డీఆర్ డిపోల వద్ద రేషన్ అందించేందుకు చర్యలు చేపట్టడం వల్ల ఇంత వరకు మొబైల్ వాహనాల్లో పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోయినట్లు అవుతుందన్నారు. కాబట్టి ప్రభుత్వం పునరాలోచన చేసి పాత పద్ధతిలోనే రేషన్ సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

డిగ్రీ కళాశాలలో ఛటర్జీ జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకుడు జగదీశ్‌బాబు

చింతపల్లి, జూన్ 27 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వందేమాతరం గేయ రచయిత బకించంద్ర ఛటర్జీ జయంతిని విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా నిర్వహించారు. ఛటర్జీ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు, అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు జగదీశ్‌బాబు మాట్లాడుతూ ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో ఛటర్జీ అగ్రగణ్యుడన్నారు. బెంగాలీతో పాటు భారతీయ సాహిత్యాలను ఆయన సుమారు శతాబ్దం పాటు సాహిత్య ప్రక్రియల ద్వారా ప్రజలను ప్రభావితం చేశారన్నారు. వందేమాతరం గేయం ఆయనకు గొప్ప గుర్తింపు తీసుకొచ్చిందన్నారు. ఆయన నేటి తరం యువతకు స్ఫూర్తిప్రదాత అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ఈశ్వర్, అధ్యాపకులు రాజు,నాగేశ్వరరావు, శివరామ్‌కుమార్,సతీశ్ పాల్గొన్నారు.

వర్షాలకు రహదారులు ఛిద్రం

పెదబయలు, జూన్ 27 : మండలంలోని గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు ఛిద్రమవుతున్నాయి. గిన్నెలకోట పంచాయతీ గుండాలగరువు, మల్లేపుట్టు, గౌడుపుట్టు గ్రామాల రహదారులు కోతకు గురయ్యాయి. దీంతో ద్విచక్రవాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అధికారులు స్పందించాలని ఆ గ్రామాలకు చెందిన ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ముసురు



ఉధృతంగా ప్రవహిస్తున్న జీకేవీధి వాగు

... 5వ పేజీ తరువాయి

వెళ్లిన విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడ్డారు.

ముంచంగిపుట్టు మండలంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. మట్టి రహదారులు బురదమయంగా మారాయి. అటుగా వాహన రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.



హుకుంపేటలో కురుస్తున్న వర్షం

వేతనాలు ఇవ్వకుంటే బతికేదెలా?

» నెల రోజులుగా డబ్బులు వేయడం లేదు » 'ఉపాధి' కూలీల ఆవేదన

జి.మాడుగుల, జూన్ 27 : మండలంలోని భీరం పంచాయతీ వి.కోడాపల్లిలో ఉపాధి కూలీలకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి రెండు గ్రూపులకు చెందిన సుమారు 40 మంది కూలీలు 19రోజులుగా చెరువు, భూమి చదును పనులను గత నెల 9 నుంచి 28 వరకు ఆయ పనులు చేపట్టారు. అయితే పనులు ప్రారంభించి నేటికి 45 రోజులు కావస్తున్నా వీరి వేతనాలు జమ కాక పోవడం గమనార్హం. దీంతో ఉపాధి కూలీలు రోజూ బ్యాంకులకు వెళ్లి తమ ఖాతాల్లో వేతనాలు జత కాలేదని తెలిసి ఉసూరుమంటున్నారు.

సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌కు మొర పెట్టుకుంటే పొంతన లేని సమాధానం చెబుతోందని కూలీలు ఆరోపిస్తున్నారు. ఉపాధి కూలీలకు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులు

పెద్దపీట వేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా అవి కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమని, క్షేత్రస్థాయిలో ఉపాధి కూలీల విషయంలో దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయమై ఉపాధి ఏపీవో కొండబాబు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. గత నెల మూడవ వారం నుంచి చేసిన ఉపాధి పనులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయాల్సి ఉందని చెప్పారు. అంతకు ముందు చేసిన పని దినాలకు వేతనాలు ఇచ్చినట్టు తెలిపారు.

చాలా ఇబ్బందిగా ఉంది



సొంత వ్యవసాయ పనులు వదిలి జీవనోపాధి కోసం ఉపాధి పనులకు వెళుతున్నాం. అయితే రోజులు గడుస్తున్నా వేతనాలు ఖాతాల్లో జమకాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు మా గురించి పట్టించు కోవడం లేదు. అన్ని సరుకుల ధరలూ పెరుగు తున్నాయి. వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలి.

- చెర్రేకి చిన్నతల్లి, ఉపాధి కూలీ, వి.కోడాపల్లి

పక్కా ప్రణాళికతో పింఛన్ల పంపిణీ

» ఎంపీడీవోలు, వెలుగు ఏపీఎంలకు కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం

పాడేరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పెన్షన్ల పంపిణీకి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని 22 మండలాల ఎంపీడీవోలు, వెలుగు ఏపీఎంలతో పెన్షన్ల పంపిణీపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. తమ పరిధిలో ఉన్న సచివాలయ సిబ్బందితో పెన్షన్ల పంపిణీని



వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవోలు, ఏపీఎంలతో మాట్లాడుతున్న కలెక్టర్

పక్కాగా చేయించాలని సూచించారు. జిల్లాలో 1 లక్షా 26 వేల మంది మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. గతంలో రూ.36 కోట్లు పంపిణీ చేశామని, ఇప్పుడు రూ.87 కోట్లకు పెరిగిందన్నారు. ఎంపీడీవోలు బ్యాంకు అధికారులతో చర్చించి తగిన నగదును సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ నెల 29న నగదును విడుదల చేసుకుని, జూలై ఒకటో తేదీన ఉదయం 6 గంటల నుంచే పెన్షన్ పంపిణీ చేపట్టాలన్నారు. ఇందుకోసం సచివాలయం సిబ్బంది, ఇంకా అవసరమైతే ఇతర శాఖల ఉద్యోగుల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మొదటి రోజు 70 నుంచి 80 శాతం పంపిణీ పూర్తి చేయాలన్నారు. మూడు నెలల అరియర్స్, జూన్ నెలకు రూ.4 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు చొప్పున లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. పెద్ద మొత్తంలో నగదు తరలిస్తున్నందున పోలీస్ అధికారులకు సమాచారం అందించి అవసరమైన భద్రతను పొందాలన్నారు. అలాగే ఎంపీడీవోలు తగినన్ని బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేసుకుని ఆ దిశగా పంపిణీ మ్యాపింగ్ చేయాలన్నారు. ప్రతి 50 మందికి ఒకరు చొప్పున పెన్షన్ పంపిణీ చేయాలని, పంపిణీ చేసిన తర్వాత రసీదు అందించాలన్నారు. పెన్షన్ల పంపిణీపై డీఆర్‌డీఏ పీడీకి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలన్నారు. ఎక్కడైనా సచివాలయ సిబ్బంది ఎంపీడీవోల మాట వినకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వెలుగు ఏపీఎంలు క్షేత్ర పర్యటన చేసి పెన్షన్ల పంపిణీని విధిగా పర్యవేక్షించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు.

'డుంబ్రిగుడలో ఎస్‌బిఐ ఏటీఎం ఏర్పాటు చేయాలి'

డుంబ్రిగుడ, జూన్ 27 : డుంబ్రిగుడ లో ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్ ఏర్పాటు చేయాలని మండలవాసులు కోరుతున్నారు. మండలంలో యూనియన్ బ్యాంకు ఏటీఎం సెంటర్ ఒక్కటి ఉండడం, అది కూడా అధికశాతం సేవలు అందించలేకపోతోందని అంటున్నారు. దీంతో చాలా ఇబ్బందిగా ఉంటోందని బ్యాంకు ఖాతాదారులు వాపోతున్నారు. మండలంలో అనేక మంది వినియోగదారులు మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. దీంతో అత్యవసరమైనపుడు సరైన ఏటీఎం లేకపోవడంతో ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఎస్‌బీఐ ఏటీఎం లేనందున ఆ బ్యాంకు ఖాతాదారులు అరకువేలి వెళ్లాల్సి వస్తోందని మండలవాసులు అంటున్నారు. ఎస్‌బీఐ ఏటీఎం ఏర్పాటుకు ఎప్పటి వినతులు వినిపిస్తున్నామన్నారు.

ఈ విషయమై ఎస్‌బీఐ బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

అంతా మనవారే.. అభివృద్ధికి అవకాశం

» మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

కొయ్యూరు, జూన్ 27 : మంత్రివర్గంలో కొనసాగుతున్నవారందరూ మన వారే, కాబట్టి ఈ ఐదేళ్లలో ఎనలేని అభివృద్ధి చేసుకునే అవకాశం కలిగిందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పాడేరు ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. గురువారం సాయింత్రం కొయ్యూరు జిల్లా పరిషత్ అతిథి గృహ ఆవరణలో తెలుగుదేశం పార్టీ మండల సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గొలిసింగి సత్యనారాయణ, తోట దొరబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఈశ్వరి మాట్లాడుతూ నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉన్న మంత్రులు లోకేష్, అనితతో పాటు స్పీకర్‌గా నర్సీపట్నం ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు ఉన్నారని.. వీరే కాకుండా రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి తదితరులంతా అందుబాటులో ఉన్నందున ఎప్పటికప్పుడు సమస్యలు వారి దృష్టికి తీసుకువెళ్లి గడిచిన ఐదేళ్లలో కుంటుపడిన అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ఈశ్వరి పిలుపునిచ్చారు.

నియోజకవర్గంలో ఓటమికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. ఈ ఓటమిని ఛాలెంజ్‌గా ప్రతీ కార్యకర్త తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండా



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరి

ఎగురవేయాలన్నారు. ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. కార్యకర్తలు నిరుత్సాహానికి గురి కావాల్సిన అవసరం లేదని, అనతి కాలంలో తనకు పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మనమంతా చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ శ్రీరామూర్తి, నేతలు రామూర్తి, వై.వరహాలబాబు, పోటుకూరి సన్యాసిరావు, వాసా రాంబాబు, బెల్లంకొండ సత్తిబాబు, దిబ్బా రత్నం, పీటా సింహాచలం, ఏలూరి రత్నం, బోనంగి సత్యవతి, గర్రెంగి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా మధ్యాహ్న భోజన పథకం మెనూ అమలు

జిల్లా విద్యాశాఖ ఏడీ అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ అప్పారావు

ముంచంగిపుట్టు, జూన్ 27 : పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం సక్రమంగా అమలు చేయాలని అల్లూరి జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అప్పారావు నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం నిర్వహించిన అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ప్రతీ రోజు విధిగా విద్యార్థుల హాజరు నమోదు చేయాలని, మెనూ, టాయ్‌లెట్స్ ఫొటోలు తీయాలని, ఉపాధ్యాయులు విధిగా ఫేసియల్ హాజరు వేయాలని, విద్యార్థుల హాజరు వివరాలను రోజు ఆన్లైన్ నమోదు చేయాలని, ఆన్లైన్ పనులను సకాలంలో చేయాలని, పిల్లల వర్క్ బుక్స్ కరెక్షన్ చెయ్యాలని, లెసన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. అలాగే విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని అన్నారు. నాడు-నేడు పనులు సకాలంలో పూర్తి అయ్యే విధంగా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సమన్వయకర్త శివ పాత్రుడు, ఎంఈవో క్రిష్ణమూర్తి, సీఎంవో జ్ఞానప్రకాష్, హెచ్ఎంలు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

కొత్త కలెక్టర్ అమ్మవారి దర్శనం.. అల్లూరికి నివాళి





బాధ్యతలను స్వీకరించే ముందు పాడేరులోని మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్, అనంతరం కలెక్టరేట్ వద్ద అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దినేశ్‌కుమార్ - ఆంధ్రజ్యోతి, పాడేరు

నాణ్యమైన సేవలే లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

సామర్థ్యాలు మరింతగా మెరుగుపడాలని, ఎక్కడా చూచిరాతలు జరగకూడదన్నారు. జిల్లాలో రెండో విడత దోమల మందు స్ప్రేయింగ్ పక్కాగా జరగాలన్నారు. వైద్య సిబ్బంది, వీఆర్‌వోలు, అంగన్‌వాడీ వర్కర్లు సమన్వయంతో స్థానిక సర్పంచుల భాగస్వామ్యంతో స్ప్రేయింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ నీటిసరఫరా విభాగం ఇంజ నీరింగ్ పనులపై ప్రత్యేకంగా సమీక్షిస్తామన్నారు. అలాగే రంప చోడవరంలో సోమవారం, చింతూరులో బుధవారం, పాడేరులో శుక్రవారం 'మీకోసం' ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని అమలు చేసి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. అలాగే ఆయా వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



కలెక్టర్ సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖలఅధికారులు

ఉపాధి హామీ పనులు ముమ్మరంగా చేపట్టాలి

జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పనులను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఉపాధి కూలీల చెల్లింపుల్లో ఎటువంటి జాప్యం చేసినా ఉపేక్షించేది లేదన్నారు. ఈ పథకం అమలులో అనవసర సమస్యలు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీవోలు నిరంతరం ఉపాధి హామీ పనులను పర్యవేక్షించాలన్నారు. అలాగే తుఫాన్, వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస చర్యలు చేపట్టేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ఠ, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, పాడేరు సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, చింతూరు ఆర్‌డీవో కావూరి చైతన్య, డీఆర్‌వో బి.పద్మావతి, ఎస్‌డీసీలు వీవీఎస్.శర్మ, భవాని, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం.రాజు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, డీఎంహెచ్‌వో సి. జమాల్‌భాషా, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ కొండలరావు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



పూరిల్లుపై కూలిన చెట్టు

పూరిల్లుపై కూలిన చెట్టు

ముంచంగిపుట్టు, జూన్ 27 : మండలంలో గల దారెల పంచాయతీ కుమ్మరిపుట్టులో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇంటిపై భారీ మామిడి చెట్టు పడింది. దీంతో ఇల్లు పూర్తిగా దెబ్బతింది. ఆ సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న తల్లీకొడుకులు లక్ష్మీ, బాబీలు తీవ్రంగా గాయపడ్డారు. పంచాయతీ సర్పంచ్, టీడీపీ పార్టీ డివిజన్ నేత పి.పాండురంగస్వామి క్షతగాత్రులను పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. అతని వెంట టీడీపీ నేతలు మురళి, అచ్చిబాబు తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో భారీ వర్షాలు

చింతపల్లి, జూన్ 27 : జిల్లాలో రాగల ఐదు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. జూలై 2 తేదీ వరకు చింతపల్లి, పాడేరు, అరకు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో 70 ఎంఎం నుంచి 97 ఎంఎం వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. అధిక వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు ఖరీఫ్ సాగుకి సన్నద్ధం కావాలన్నారు.

ఆర్ఏఆర్ఎస్‌లో ఇద్దరు శాస్త్రవేత్తలు బదిలీ

చింతపల్లి, జూన్ 27 : స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో రెండేళ్ల పాటు విధులు నిర్వహించిన ఇద్దరు శాస్త్రవేత్తలను బదిలీ చేస్తూ ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. విత్తనోత్పత్తి విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరావుని ఆముదాలవలస వ్యవసాయ పరిశోధన స్థానానికి, విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కదిరి మోహన్‌రావు తిరుపతి వ్యవసాయ కళాశాలకు బదిలీ చేశారు. ఈమేరకు బదిలీ అయిన శాస్త్రవేత్తలు శుక్రవారం రిలీవ్ అయ్యారు. వీరి స్థానంలో ఇద్దరు శాస్త్రవేత్తలను నియమించినప్పటికీ ఇప్పటి వరకు పరిశోధన స్థానంలో రిపోర్టు చేయలేదు.

అలెస్టమ్ కంపెనీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్, జూన్ 27 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో అలెస్టమ్ కంపెనీలో ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అలెస్టమ్ కంపెనీలో డిప్లొమో మెకానికల్, ఎలక్ట్రిక్, ఆటోమొబైల్, ఐటీఐ వెల్డర్ విద్యార్హత కలిగిన 18 నుంచి 22 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతీ ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులు తిరుపతి జిల్లా శ్రీసిటీ, తడ ప్రాంతాల్లో ఉద్యోగాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 6304634447, 9398338105 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు వినియోగదారుల అవగాహన సదస్సు

జి.మాడుగుల, జూన్ 27 : బొయితిలి పంచాయతీ సూరిమెట్లలో శుక్రవారం వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు కె.కేశవరావు, జె.శ్రీను తెలిపారు. ఈ సదస్సును ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అలాగే మండల కమిటీ సభ్యులను ఈ సదస్సులో ఎన్నుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బి.చిట్టిబాబు, నాయకులు కె.రమేశ్, జి.రమేశ్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి గిరిజన సమస్యలు



మంత్రి సంధ్యారాణిని కలిసిన టీడీపీ అరకు నేతలు

హుకుంపేట జూన్ 27 : గిరిజన సంక్షేమ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి అరకు టీడీపీ ఇన్‌చార్జి దొన్నుదొర, ఇతర నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గిరిజన సమస్యలు జీవో నెంబర్ 3 రోడ్డు, తాగునీరు వైద్య, విద్యా సమస్యలు, గత ప్రభుత్వంలో కుంటుపడిన అభివృద్ధి చేపట్టాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్టు టీడీపీ నేతలు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో టీడీపీ నేతలు శ్యామ్ శంకర్, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

రైతులకు శిక్షణ

హుకుంపేట జూన్ 27 : మండలంలోని చికుమద్దుల పంచాయతీలో రైతులకు వ్యవసాయంపై గురువారం శిక్షణ స్థానిక వ్యవసాయ ఆధికారిణి లీలావతి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా పాడేరు ఏరువాక కేంద్ర శాస్త్రవేత ప్రదీప్‌కుమార్ మాట్లాడు తూ గిరిజన రైతులకు శాస్త్రీయ పద్ధతులపై పూర్తి స్థాయి అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ఏకలవ్య ఫౌండేషన్ వారు అందిస్తున్న వాటర్‌షెడ్ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాడేరు మండల వ్యవసాయాధికారి విజయమ్మ, వెంకటేష్, ఉమా, చంటి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు మిలీషియా సభ్యులు లొంగుబాటు

... 5వ పేజీ తరువాయి

భాగంగా అందిస్తున్న పథకాలకు ఆకర్షితులై వీరు లొంగిపోయినట్టు తెలిపారని ఎస్ఐ లోకేష్‌కుమార్ వివరించారు. మారుమూల గ్రామాల్లో మావోయిస్టు కార్యకలాపాలు నిరోధించడంతో పాటు కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా మావోయిస్టులకు ఆశ్రయం కల్పించేందుకు ఎవరూ ముందుకురాకుండా చర్యలు తీసుకున్న మంప ఎస్ఐ లోకేష్ కుమార్‌ను, ఇటీవల సీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణకు ఎస్పీ తుహిన్‌సిన్హా అభినందించారు.